
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
సోమవారం | 25 | ఆగస్టు | 2025 ◆ పేజీలు : 3




## జీళ్ళచెరువు గ్రామంలోని ఊర చెరువు అలుగు వద్ద గండిని పూడ్చివేత

**పాలేరు ఆర్సీ ఆగస్టు 24 ప్రజాజ్యోతి:** కూసుమంచి మండలం, జీళ్ళచెరువు గ్రామంలోని ఊర చెరువు అలుగు వద్ద ఏర్పడిన గండిని ఇరిగేషన్ అధికారులు ఆదివారం పూడ్చివేశారు. గ్రామంలో గత పది రోజులుగా భారీ వర్షాలు వరదల నేపథ్యంలో అలుగుకు ఉధృతంగా వరద వచ్చి పొంగిపోర్లుతున్న నేపథ్యంలో కట్ట తెగకుండ అలుగు ప్రాంతంలో జేసీబీ సహాయంతో కొంత గండిని ఏర్పాటు చేశారు. వరద ఉధృతి కారణంగా గండి పెద్దగా ఏర్పాటు కావడంతో

మిగతా 2 లో...

### రాజకీయాలకతీతంగా...
# పేదలకు సంక్షేమ పథకాలు అమలు

**57వ డివిజన్ లో రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను, రేషన్ కార్డులను పంపిణీ చేసిన మంత్రి తుమ్మల**

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార,చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక రాజకీయాలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు,ఆదివారం ఖమ్మం 57వ డివిజన్ రమణ గుట్ట ప్రాంతంలో 2 కోట్ల 36 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ 57వ డివిజన్ ప్రాంతంలో పేదలు ఎక్కువ ఉన్నారని స్థానిక నాయకులు కోరగా ప్రభుత్వం నుండి వచ్చిన నిధులను అధికంగా ఇక్కడ కేటాయించడం జరిగిందని అన్నారు. ఖమ్మం నగరంలో 2000 ఇండ్లు మంజూరు చేస్తే కేవలం 57వ డివిజన్ పరిధిలో 200 పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు.అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు విడతల వారీగా ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ సాధ్యం ఉన్నంత వరకు కృషి చేస్తామని అన్నారు.రాజకీయాలకతీతంగా నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు.లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకునేలా చూడాలని, డివిజన్ లో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైయిన్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని, ఒకసారి చేసిన అభివృద్ధి పని పది కాలాల పాటు నిలిచి పోవాలని అన్నారు. పాఠశాల నిర్మాణానికి

మిగతా 2 లో...

## రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు విక్రయం

- ఉద్యోగ, సహకార సంఘాలు,స్వచ్ఛంధ సంస్థలకు చక్కటి అవకాశం
- అందుబాటులోని ధరల్లో మధ్యతరగతి ప్రజలకు ఇంటి వసతి




**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ పోలేపల్లిలోని అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ ప్రాజెక్టును ఉన్నది ఉన్నట్లుగా ప్రాతిపదికన విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు మేలు చేకూర్చాలన్నలక్ష్యంతో జలజ టౌన్ షిప్ పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. నిర్మాణానికి అయిన ఖర్చుతోనే ఈ బహుళ అంతస్తుల సముదాయంతో

మిగతా 2 లో...

## లోక్యతండాలో విషాదం..

- ట్రాక్టర్ రోటావేటర్ కిందపడి ఆరేళ్ళ బాలుడు మృతి



**పాలేరు ఆర్సీ, ఆగస్టు24, ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం లోక్యతండా పంచాయతీ శివారు కొత్తతండాలో ఆదివారం విషాదం నెలకొంది. కొత్త తండాకు చెందిన వడ్తియా రాంబాబు తన ఆరేళ్ళ కుమారుడు భువనేశ్వర్ తో కలిసి తన పోలంలో ట్రాక్టర్ రోటావేటర్ తో దుక్కి దున్నుతూ ఉన్నాడు. ప్రమాదవశాత్తు భువనేశ్వర్ రోటావేటర్ లో పడి మృతి చెందాడు. కండ్ల ముందే కన్నకొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు బోరుమని రోదిస్తున్నారు. రాంబాబు, దీపిక దంపతులకు ఆరేళ్ళ క్రితం కవలపిల్లలు జన్మించారు. సుమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జీళ్ళచెరువు గ్రామంలోని ఊర చెరువు అలుగు వద్ద గండిని పూడ్చివేత

(మొదటి పేజీ తరువాయి...)

పదిరోజూలుగా జీళ్ళచెరువు – చేగొమ్మ రహదారి నుంచి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇరిగేషన్, పంచాయతీ అధికారులతో మాట్లాడారు. తక్షణమే స్పందించిన ఇరిగేషన్ ఈఈ రమేష్‌రెడ్డి, ఏఈ శేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ టిప్పర్లతో మట్టి పోసి జేసీబీ సహాయంతో పూడ్చివేశారు. దీంతో ప్రయాణికులు, రైతులు, ప్రజలు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు విక్రయం

(మొదటి పేజీ తరువాయి...)

ఉన్న ప్రాజెక్టు మొత్తాన్ని లాటరీ ద్వారా కేటాయించనున్నారు. వివిధ సహకార సంఘాలు, ఉద్యోగ సంఘాలు, బిల్డర్లు,డెవలపర్లు,జాయింట్ వెంచర్లు ఇలా గ్రూప్ హౌసింగ్ పథకాలపై ఆసక్తి ఉన్నవారు ఎవరైనా ఇందుకోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ జూలై 22 వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 8 వ తేదీన లాటరీ విధానంలో కేటాయించనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టును గురించి తెలుసుకునేందుకు పలు సంఘాల ప్రతినిధులు ఇతరులు అనేక మంది వస్తున్నారు.సుమారు 9.22 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టులో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించిన ఎనిమిది బ్లాకులు, తొమ్మిది ఫ్లోర్లు ఉన్నాయి. ఒక్కో ఫ్లోర్ లో 8 ఫ్లాట్లతో ప్రాజెక్టు మొత్తం మీద 576 ఫ్లాట్లు ఉన్నాయి. వీటి పనులు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి.ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా 60 అడుగుల అప్రోచ్ రోడ్డు మంజూరై పనులు కొనసాగతుండటమే కాకుండా, మున్నేరు నదికి సమీపంలో ఉండటం ప్రత్యక ఆకర్షణతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ప్రాజెక్టు ప్రత్యేకతలని అధికారులు వివరించారు. మంచి వసతులతో మధ్యతరగతి ప్రజలకు, ముఖ్యంగా వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు మేలు చేకూర్చాలన్న లక్ష్యంతో,నిర్మాణానికి అయిన ఖర్చును మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటూ చదరపు అడుగు ధరను రూ.1150 మాత్రమే నిర్ణయించామని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఖమ్మం లోని వివిధ ఉద్యోగ సంఘాలు, సహకార సంఘాలు, ఇతరత్రా స్వచ్ఛంధ సంస్థలు ప్రభుత్వం నామ మాత్రపు ధరతోనే అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ టౌన్ షిప్ లో మౌళిక వసతుల కల్పన కూడా జరుగుతుందని స్పష్టం చేశారు.ఇప్పటికే కొన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వీటిపై ఆసక్తి కనపరుస్తూ ప్రాజెక్టు ప్రాంగణంలోనే సమావేశం కూడా నిర్వహించుకున్నారని తెలిపారు.ఇక్కడి భూములు, నిర్మించిన భవనాలపై ఎటువంటి అపోహలు వద్దని మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తి పారదర్శకంగా లాటరీ ద్వారానే కేటాయింపులు చేస్తామన్నారు.

విద్యుత్ పట్ల రైతులకు అవగాహన

## జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఇనుగుర్తి శ్రీనివాసచారి



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక విద్యుత్ ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటూ ,విద్యుత్ వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు విద్యుత్ పట్ల అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని ఇనుగుర్తి శ్రీనివాసా చారీ, ఖమ్మం సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు . అందుకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతూ ,చైతన్యం కల్పిస్తున్నామని వివరించారు. జీరో విద్యుత్ ప్రమాదాల లక్షంగా సర్కిల్ లోని డి.ఈ టెక్నికల్ ఆధికారులను సేఫ్టీ అధికారులు గా నియమించి విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని అన్నారు.రైతుల సమస్యలను విని వారి సమస్యలను పరిష్కరించడానికి "విద్యుత్ అధికారుల పోలం బాట కార్యక్రమాన్నికూడా చేపడుతున్నామని ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు లూజ్ లైన్లు 2197 పునరుద్దరించామని ,వంగిన పోల్ లు 1510 సరి చేశామని, మధ్య స్థంబాలు 2296 నెలకొల్పామని,ఎంతో మంచి సత్ఫలితాలు ఇస్తుందని చెప్పారు .లో లెవెల్ లైన్ క్రాసింగ్ 396,డబల్ ఫీడింగ్ పాయింట్లను 683 మార్చమని చెప్పారు . తక్కువ ఎత్తులో ఉన్న డీటీర్ ప్లింత్ లను 179 ఎత్తు పెంచమని చెప్పారు .జన సామర్థ్యం ప్రదేశాలలో భద్రత సూచనల బోర్డ్లు ఏర్పాటు చేస్తున్నమని తెలిపారు .ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిని యుద్ధ ప్రాతిపదికన సరి చేస్తున్నమని చెప్పారు . నిరంతర శిక్షణ ,భద్రతా పద్ధతులను బలోపేతం చేయడం వలన భద్రతా ప్రమాణాలను పెంచగలుగుతున్నామని తెలిపారు.విద్యుత్ ప్రమాదాల నివారణను ఒక సంకల్పంగా తీసుకొని అన్ని చర్యలు తీసుకుంటూ జీరో ప్రమాదాల లక్షంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు .ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తిన 1912 టోల్ ఫ్రీనంబర్ కు సంప్రదించాలని కోరారు.

# రాజకీయాలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అమలు

(మొదటి పేజీ తరువాయి...)



అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని, వర్షాకాలం ముగిసిన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు,సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ్ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులు,రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను పేదల ఇంటి వద్దకు వెళ్లి అందించాలని అన్నారు.కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ పేదల అభివృద్ధి,సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి తుమ్మల కృషి ఫలితంగా 230 మంది లబ్ధిదారులకు 57వ డివిజన్ లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్నబియ్యం సరఫరా, రేషన్ కార్డులను జారీ చేశామని అన్నారు.ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని, ఇండోర్ పట్టణంలో పాటిస్తున్న పారిశుధ్య చర్యలను మన ఖమ్మం నగరంలో కూడా అమలు చేసేందుకు చర్యలు చేపడతామని అన్నారు. మురుగు కాల్వలలో ప్లాస్టిక్ కవర్లు పడేయవద్దని అన్నారు.అనంతరం మంత్రి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, మునిసిపల్ ఇంజినీరింగ్ ఖమ్మం డివిజన్ కార్య నిర్వాహక ఇంజనీర్ వి.రంజిత్,ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ,ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధమిక హక్కులకు భంగం వాటల్లే చట్టాలను పోరాటాల ద్వారా తిప్పికొట్టాలి

- **రాజ్యాంగ విలువలను కాపాడుకోకపోతే దేశ మనుగడకే ప్రమాదం**
- **పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**



**బోనకల్,ఆగష్టు24,(ప్రజాజ్యోతి ):** రాజ్యాంగ విద్య ప్రజలకు అందిస్తే కొందరికి ప్రమోదంగా ఇంకొందరికి ప్రమాదంగా ఉంటోందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు.ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో జరిగిన స్టడీ సర్కిల్ లో రాజ్యాంగ అధ్యయనం – ఎవరికి ప్రమోదం?ఎవరికి ప్రమాదం?అనే అంశంపై మాట్లాడారు.ప్రకృతి విధ్వంసం లేని,అందరికీ సమాన అవకాశాలు కల్పించే అభివృద్ధిని కోరుకునేవారు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని పోరాడుతున్నారన్నారు.పౌరులకు హక్కులతో పాటు విధులను,బాధ్యతలపై అవగాహన కల్పిస్తే చైతన్యం పెరిగి మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు.విద్యార్థులు,ప్రజలు,అధికారులు, పాలకులు,న్యాయకోవిదులు ఇలా అన్ని వర్గాల ప్రజలు రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని రాజ్యాంగ విలువలను కాపాడుకోకపోతే దేశ మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు.ప్రజాస్వామ్యం మెరుగుపడాలంటే ఓటు విలువను ప్రచారం చేయాలని ఎన్నికల సంఘం స్వతంత్రంగా రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలన్నారు.పెట్టుబడిదారులే నేరుగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే చట్టాలు దుర్వినియోగం కావడమే కాకుండా కొత్త చట్టాలు వారికి అనుకూలంగా చేసుకుంటారన్నారు,ఈ పరిస్థితి విషమంగా తయారుకాకూడదంటే ప్రజలు చైతన్యం పెంచుకుని సరైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. ఎవరైతే లాభాల వేటలో ప్రకృతి విధ్వంసం సృష్టిస్తారో, ఎవరైతే సమాజంలో అసమానతలు,మౌఢ్యం ఉండాలనుకుంటారో,అవినీతి,అరాచకాలు సృష్టిస్తారో, అధికార దుర్వినియోగానికి పాల్పడతారో వారు రాజ్యాంగ విలువలు ప్రజలకు తెలియకూడదని,ప్రజలు చైతన్యం కాకూడదని కోరుకుంటారన్నారు. ప్రజలు చైతన్యం పొందితే వారికి ప్రమాద ఘంటికలు మోగినట్లేనన్నారు.రాజ్యాంగం మౌళిక స్వరూపం మార్చే కుట్రలు, ప్రాధమిక హక్కులకు భంగం వాటల్లే కుట్రపూరిత చట్టాలను తెచ్చే ప్రయత్నాలను ప్రజాస్వామిక వాదులు ప్రజల మద్ధతుతో పోరాటాల ద్వారా తిప్పికొట్టాలన్నారు.స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన స్టడీ సర్కిల్ లో చింతలచెరువు కోటేశ్వరరావు,దొండపాటి నాగేశ్వరరావు,కిలారు సురేష్,బంధం శ్రీనివాసరావు,జొన్నలగడ్డ సునీత,ఎరగాని కృష్ణవేణి, చలమల హరి కిషన్ రావు,బొప్పాల రమేష్,బూర్గుల అప్పాచారి,గండు సైదులు,ఉప్పర శ్రీను,పిల్లలమర్రి వెంకట అప్పారావు,చేపూరి వెంకటేశ్వర్లు,బోయినపల్లి పున్నయ్య,షేక్ సిలార్,గుగులోతు నరేష్,పెద్దప్రోలు కోటేశ్వరరావు,తేనె వెంకటేశ్వర్లు,బి గోపి తదితరులు పాల్గొన్నారు.



## పితృవియోగంలో వున్న మాజీ కార్పొరేటర్ జంగం భాస్కర్ ను పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.



**నేలకొండపల్లి, ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ పాటివారి గూడెం గ్రామానికి చెందిన ఖమ్మం జిల్లా నాయకులు మాజీ కార్పొరేటర్ జంగం భాస్కర్ తండ్రి జంగం వెంకయ్య ఇటీవల పరమపదించిన విషయం,తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలియజేసిన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్న ముఖ్య నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ సాధు రమేష్‌రెడ్డి మద్ది మల్లారెడ్డి ప్రతాపనేని రఘు, అప్పారావు,షేక్ సైదులు,గుత్త నరేష్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

## రామతులిశమ్మకు నివాళులు అర్పించిన మంత్రి తుమ్మల..



**తల్లాడ, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ మాజీ ఎంపీటీసీ వేమిరెడ్డి రామతులశమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం తల్లాడలో రామతులిశమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల నాయకులు, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కృష్ణారెడ్డిని ఓదార్చారు . తొలుత ఆమె చిత్రపటానికి మంత్రి తుమ్మల పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము, దిరిశాల నరసింహారావు, మారెళ్ళ లక్ష్మణరావు, పొట్టేటి బ్రహ్మారెడ్డి, లక్ష్మారెడ్డి, పొట్టేటి జనార్దన్ రెడ్డి, తడకమల్ల వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# నడుద్దాం నడిపిద్దాం కలిసి వెళ్దాం

- నడక ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుంది
- నడక వల్ల కలిగే ప్రయోజనాలు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** స్థానిక ఉదయం నడక ఆరోగ్యానికి అన్నివిదాల మేలు చేస్తుందని నడక అనేది గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి అనేక ఆరోగ్య సమస్యలను నివారించడానికి ఉదయం నడక వ్యాయామము యోగా లాంటి సాదనలు సహాయపడుతాయని.నడక వల్ల ఎముకలు మరియు కండరాలను బలోపేతం చేస్తుందని, ఆరోగ్యకరమైన బరువును తగ్గించడానికి నడక సహాయపడడమేకాక మానసిక స్థితిని మెరుగుపర్చి శరీర శక్తి స్థాయిలను పెంచుతుందని. నడక అనేది సులభంగా చేయగల వ్యాయామని ప్రతిరోజూ ఉదయం నడక తప్పనిసరిగా చేయాల్సిందేనని ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ సీనియర్ నడక సాదకులు వారి అనుభవాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నడక సాదన పూర్తి చేసుకున్న అనంతరం ఈవిధంగా అన్నారు. క్రమం తప్పకుండా నడవడం వల్ల హృదయ స్పందన రేటు పెరిగి రక్త ప్రసరణ మెరుగుపడడమే కాకుండా, రక్తపోటు తగ్గి గుండె సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నడక అదనపు శరీర కొవ్వును కరిగిస్తుంద న్నారు. నడక వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని, ఇది మధుమేహం ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు.నడక వల్ల ఎముకలు మరియు కండరాలను బలోపేతం చేస్తూ శరీర ఒత్తిడి నిరాశను తగ్గించడంలో సహాయపడుతుందని, మానసిక స్థితిని పెంచుతుందన్నారు. శారీరక శ్రమ ఆత్మగౌరవాన్ని పెంచుతుందని. దినచర్యలో నడకను భాగంగా చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని.కొత్త స్నేహితులను సంపాదించుకోవచ్చని తెలియజేశారు.అందువల్ల వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ ఉదయం సాయంత్రం నడక సాదన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ సీనియర్ నడక సాదకులు మంద వెంకటేశ్వర్లు,రావూరి శ్రీనివాస్, గంగవరపు వీరభద్రం,పాటి శ్రీనివాస్,రవి,తాళ్ళూరి సత్యనారా యణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి..

- గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల నాగేశ్వరావు.



**కారేపల్లి,ఆగస్టు 24, ప్రజా జ్యోతి :** గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల నాగేశ్వరావు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సింగరేణి మండల కేంద్రంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అనంతారపు వెంకటాచారితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైయస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ ఆసుపత్రులలో 1000 గంటలు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు జారీ చేయలేదన్నారు. వైయస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ వైద్యులను పారా మెడికల్ బోర్డు కింద తీసుకోని శిక్షణ ఇచ్చేందుకు ప్రతి ఒక్కరి నుండి రూ.200లను డిడి కట్టించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది గ్రామీణ వైద్యులు ఉన్నట్లు పేర్కొన్నారు.అనునిత్యం గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవ అందిస్తున్న గ్రామీణ వైద్యులకు రక్షణ కరువైందన్నారు.దశాబ్దాల కాలంగా మారుమూల గ్రామాలలో ప్రజలతో మమేకమై అనుభవజ్ఞులైన గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యం అందిస్తున్నారన్నారు.గ్రామీణ వైద్యులు సకాలంలో స్పందించి అత్యవసర వైద్యం అవసరం ఉన్న వారిని సమీప పట్టణాల్లో గల ప్రధాన ఆసుపత్రులకు(అర్హత కలిగిన వైద్యుల వద్దకు )తరలించి అనేకమంది ప్రాణాలను కాపాడగలుగుతున్నారన్నారు. కొంతమంది వేధింపుల కారణంగా గ్రామాలలో ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం చేయడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలు స్థానిక ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపి లకు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు చట్టబద్ధత కల్పించాలనే అంశంపై ఇటీవల హైదరాబాదులో దక్షిణాది రాష్ట్రాల గ్రామీణ వైద్యుల సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.మరికొద్ది రోజుల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపీలు అందిస్తున్న ప్రాథమిక సేవలపై కనువిప్పు కల్పించుటకు ధర్నా చేసేందుకు కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.ఆర్ఎంపీలు లేకుంటే గ్రామాలలో ప్రజలు అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడతారని గ్రామీణ వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ వైద్యుల సేవలను గుర్తించి స్థానికంగా వారికి ఎటువంటి హాని కలగకుండా రక్షణ కల్పించాలని కోరారు.అదేవిధంగా గ్రామీణ వైద్యులు తమ అర్హతకు మించి వైద్యం చేయరాదని సూచించారు.

# వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలి.

## ఎన్నికల హామీలన్ని నేరవేర్చాలి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం.






**కారేపల్లి, ఆగస్టు 24, ప్రజా జ్యోతి :** వ్యవసాయ యంత్రీకరణతో వ్యవసాయ పనులు తగ్గాయి. ఏడాదికేడాది ఉపాధి హామీ పథకం కు నిధులు కుదిస్తుండటంతో కూలీలకు ఉపాధి కరువతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ లు అన్నారు. ఆదివారం సింగరేణి మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈమహాసభలో వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా వ్యవసాయ కూలి రేట్లు పెరగటం లేదన్నారు. వ్యవసాయ కూలీలు ఐక్యతతోనే కూలీ రేట్లు పెంచుకోవటం సాధ్యమన్నారు. కూలి రేట్లు పెంపుతో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంకు బడ్జెట్ లో నిధులు తగ్గిస్తుందని, పథకం అమలులో కొత్త నిబంధనలు విధించి కూలీలకు ఉపాధి దూరం చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా మోడి ప్రభుత్వం రూ. 50.60 లక్షల కోట్ల బడ్జెట్ లో కేవలం రూ.69 వేల కోట్లు కేటాయించి ఉపాధి కూలీలకు కూలి గిట్టుబాటు కాకుండా అన్యాయం చేస్తుందని విమర్శించారు . పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని అమలు జరపటంలో ప్రభుత్వాలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయని, ఏళ్ల తరబడి పోడు సాగు చేస్తున్న గిరిజనేతరులకు నేటికి హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. పోడు సాగు చేస్తున్న గిరిజనేతరులకు హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. పోడు సాగు పై ఆంక్షల తో పేదలను వ్యవసాయం దూరం చేసే ప్రయత్నం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్లాంటేషన్ పేరుతో పేదల భూము లాక్కొని, ప్రత్యామ్నాయ భూమి చూపించకుండా ఫారెస్ట్, పోలీస్ లు నిర్బంధాలు ప్రయోగిస్తుందన్నారు. వ్యవసాయ కార్మికుల భద్రత ,రక్షణ, కోసం సమగ్ర కూలి చట్టం తేవాలని, ఆ చట్టం అమలుకి గ్రామపంచాయతీలను వేదికలుగా నిర్ణయించాలన్నారు. కేరళ తరహాలో కూలీలందరినీ పంచాయతీ పరిధిలో నమోదు చేసి పనులన్నింటికీ రేట్లు నిర్ణయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 హామీ అమలు ఊసే ఎత్తటం లేదన్నారు. ప్రజలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. పేదలకు నిత్యావసర వస్తువులను అందించే చౌకదుకాణాలను కేవలం బియ్యం పంపిణి కేంద్రాలు మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌకదుకాణాల ద్వారా నిత్యావస వస్తువులు అన్ని అందించాలని డిమాండ్ చేశారు. వ్యకాస మండల కమిటి ఎన్నిక వ్యవసాయ కార్మిక సంఘం నూతనకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు కేసగాని ఉపేందర్, కార్యదర్శి యనమనగండ్ల రవి లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీనివాస రావు, కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, తుమ్మోజు రామ్మూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు, ఐద్వా కార్యదర్శి కే.ఉమావతి, కరపటి రాంబాయి, సూరబాక ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.